

# లిటిల్ రాస్కెల్

మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**రాజేష్‌కి** అట్టే దిగులుగా లేదు. అక్కడ అనేక మృగాల మధ్య తెలియకుండానే కాలం గడిచిపోతోంది. రకరకాల ఫీట్స్ ప్రాక్టీస్ చేస్తున్న ఆర్టిస్టులని చూస్తాడు, లేదా టింకూ వుండనే వుంది. సర్కస్‌లోని వాళ్ళందరికీ రాజేష్ మచ్చిక చేసిన టింకూని చూస్తే ఎంతో ముచ్చటేస్తోంది. ఏనిమల్ ట్రెయినర్ కూడా రాజేష్ అభిరుచికి మెచ్చుకున్నాడు. మరుగుజ్జు బఫూన్ రాజేష్‌కి మంచి ఫ్రెండయ్యాడు. రాజేషంత ఎత్తుండే ఆయన వయసు దాదాపు ముప్పై దాటుతోంది. మరుగుజ్జులు సాధారణంగా ఎక్కువ కాలం జీవించరన్న సంగతి తెలుసు కాబట్టి అతను వివాహం చేసుకోలేదు. అతను ఇష్టపడ్డ ఒకే ఒక అమ్మాయి అతనికన్నా బాగా పొడవు కాబట్టి తన మనసులోని మాటని ఆమె ముందెన్నడూ బయటపెట్టలేదు. అదో దిగులు అతనికి. ఆ సర్కస్‌లోనే పనిచేసే ఆమెకి వివాహం అయిపోయి ఒక పిల్లవాడు కూడా వున్నాడు.

తీరిక వేళల్లో రాజేష్‌తోనే ఎక్కువసేపు గడుపుతున్నాడు అతను. అతని పేరు హాఫీజ్.

రాజేష్‌కి అప్పుడప్పుడూ తన తల్లి గుర్తుకొస్తూంటుంది. అప్పుడు దిగులేస్తుంది. మూడీగా అయిపోతాడు. ఏం తినడు, తాగడు, ఎవరితోనూ మాట్లాడడు. ఆ రెండు రోజుల్లోనే దాన్ని హాఫీజ్ గమనించాడు. రాజేష్‌ని మళ్ళీ మూడ్‌లోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తాడు.

ఓ చాక్‌లెట్ చూపించి రెండు గుప్పిళ్ళలోకి మార్చి 'ఏ చేతిలో వుందో కనుక్కో' అంటాడు. రాజేష్ అన్యమనస్కంగానే ఓ చెయ్యి చూపిస్తాడు. ఆ చేతి గుప్పెట తెరిస్తే వుండదు. రెండో చేతిలో కూడా వుండదు. నోరు తెరిచి చూపిస్తాడు. నోట్లో వుంటుందా చాక్లెట్. రాజేష్ నవ్వుతాడు.

లేదా రాజేష్‌ని సింహాల బోను దగ్గరకి తీసుకెళ్ళి రాజేష్ భుజం మీద టింకూని ఆ బోనులోకి వదులుతాడు. టింకూని చూస్తుంది కానీ సింహం ఏం చేయదు. టింకూ ముందు భయం భయంగా, తరువాత నిర్భయంగా సింహం మీదకి ఎక్కి కూర్చుంటుంది. వాటిని ఫోటో తీస్తాడు హాఫీజ్.

లేదా తను ఎరీనాలో చేసే రకరకాల ఫీట్స్‌ని ఎలా చేయాలో చేసి చూపిస్తాడు. చూడటానికి ఎంతో తేలికగా కనపడినా అవి చేయటం ఎంతో కష్టం అని గ్రహించాడు రాజేష్.

లేదా రాజేష్‌కి బఫూన్ వేషం వేసి అద్దం ముందు నించోపెట్టి చూపిస్తాడు. ఫోటో తీస్తాడు.

నంబియార్ మాత్రం వేలాయుధం హైద్రాబాద్ నించి తిరిగి రావడం కోసం ఎదురు చూస్తున్నాడు.

"నా పేరు వేలాయుధం" చెప్పాడు అతను దశరథరామయ్యకి ఇంగ్లీషులో.

"ఏం కావాలి?" అడిగాడు దశరథరామయ్య. రాజేష్ వెళ్ళిపోయినప్పటినుంచి ఇంట్లో ఎవరి మొహాల్లో కళలేదు. దిగులు గూడుకట్టుకుని వుంది. రాజేష్ ఏమయ్యాడో అనే దిగులు, సావిత్రి దగ్గరకి ఏ మొహం పెట్టుకుని వెళ్ళి రాజేష్ కనపడలేదని చెప్పాలా అనే బాధ.

"రాజేష్ అనే అబ్బాయి మీకు తెలుసా?" అడిగాడు.

ఆయన వేలాయుధం వంక చూశారు.

"దేనికి?" అడిగాడు.

"ఆ కుర్రాడిప్పుడు మా దగ్గర భోన్‌గిరిలో వున్నాడు."

దశరథరామయ్య అతనివంక ఆనందంగా చూశాడు.

"ఎవరు మీరు? ఎక్కడున్నాడు? భోన్‌గిరిలోనా?" అడిగాడు ఉద్వేగంగా.

ఏనుగు దగ్గర నిలబడి ఆకులు అందిస్తున్నాడు. దూరం నుంచి వస్తున్న తాతయ్యని తెల్లబోతూ చూశాడు రాజేష్.

"ఏరా భడవఖానా! నాక్కూడా చెప్పకుండా ఎందుకు వచ్చేశావ్?" అడిగాడు దశరథరామయ్య.

ఏదో కలగంటున్నట్లుగా గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు రాజేష్ సమాధానం చెప్పకుండా.

"పద" రాజేష్‌ని ఎత్తుకుని నడిచాడాయన.

నంబియార్ టెంట్‌లోకి తీసుకెళ్ళాడు.

అక్కడున్న సాంబశివరావుని, నీరజని చూశాక రాజేష్ ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది.

"హలో రాజేష్" పలకరించింది నీరజ.

"హలో ఆంటీ"

"మీ అమ్మ నిన్ను తీసుకురమ్మని ఉత్తరం రాసింది" చెప్పాడు సాంబశివరావు.

"అమ్మా? ఎక్కడుంది?" అడిగాడు రాజేష్ ఆనందంతో.

"బెంగుళూర్‌లో"

"అక్కడెందుకుంది?"

"ఏమో? అడుగుదాం" చెప్పాడు.

"నన్ను అమ్మ దగ్గరకి తీసుకెళతావా అయితే?" అడిగాడు ఆశగా.

27

"రండి, మీ కోసమే ఎదురు చూస్తున్నారు ఆవిడ."

సాంబశివరావు తనని, తన తండ్రిని, భార్యని పరిచయం చేయగానే చెప్పాడు డ్యూటీలో వున్న డాక్టర్.

"బెంగుళూర్ ఎప్పుడొచ్చారు?" అడిగాడు.

"గంటయింది. హోటల్‌నుంచి సరాసరి యిక్కడికే వస్తున్నాం. సావిత్రిగారికి ఏమైంది?" అడిగింది నీరజ.

"కేన్సర్"

"ఇప్పుడెలా వున్నారు?"

ఆ ప్రశ్నకి డాక్టర్ సమాధానం చెప్పలేదు. డాక్టర్‌ని అనుసరించారు అంతా.

"చూడండి ఎవరొచ్చారో."

చెప్పాడు డాక్టర్ మంచం మీద పడుకున్న ఓ పేషెంట్‌తో. ఆమె కళ్ళు తెరిచి చూసింది. రాజేష్‌ని చూడగానే ఆమె కళ్ళల్లో కాంతి.

"అమ్మా"

రాజేష్ ఆవిడ దగ్గరకు పరిగెత్తాడు. తల్లి ప్రక్కన మంచం మీద కూర్చుని వెక్కి వెక్కి ఏడవసాగాడు. ఏడుస్తూ అడిగాడు. "ఎందుకన్నీ అబద్దాలే చెప్పావ్? ఆయన నాన్న కాదుట కదా? ఇక్కడెందుకున్నావ్? ఏమైంది నీకు? మనింటికి పోదాం పద."

సావిత్రి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఆయన మీ నాన్నగారే" చెప్పింది.

సాంబశివరావు తన జీవితంలో తను మొదటిసారిగా చూసిన సావిత్రి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఏడవొచ్చా? తప్పు కదూ? షేమ్ షేమ్. పప్పీ షేమ్" చెప్పింది రాజేష్‌కి, తన కన్నీళ్ళు తుడుచుకుని కొడుకు చేతిని తన చేతుల్లోకి తీసుకుని.

"ఒకోసారి ఏడిస్తేనే బావుంటోంది నాకు."

"మీరేనా నీరజ?" అడిగింది సావిత్రి నీరజని చూసి.

"అవును.. మిమ్మల్ని చూడాలని చాలాసార్లు అనుకున్నాను."

సావిత్రి చిన్నగా నవ్వింది.

"మీరు నాకు తెలియదు" గొంతు పెగుల్చుకుని చెప్పాడు సాంబశివరావు.

"నిజమే" చెప్పింది సావిత్రి.

"మరెందుకిలా?" ఆ వాక్యం పూర్తిచేయలేదు సాంబశివరావు.

సావిత్రి నర్స్ సహాయంతో లేచి దిండుకింద దాచి వుంచిన, నలిగిపోయిన ఓ కవరుని నీరజకి అందించి చెప్పింది.

"నన్నూ, రాజేష్‌ని కాసేపు ఒంటరిగా వదలండి."

దశరథరామయ్యకి అనిపించింది మృత్యువు సావిత్రికి చాలా దగ్గరగా వచ్చేసిందని.

హాస్పిటల్‌లో విజిటర్స్ కోసం ప్రత్యేకింపబడ్డ సోఫాలో కూర్చున్నారు. నీరజ ఆ కవరు సాంబశివరావు పేరు, తమ ఇంటి చిరునామా రాసి వుండటం చూసింది.

"సావిత్రిని నేను ఇదే మొదటిసారి చూడటం" చెప్పాడు సాంబశివరావు తండ్రికి, భార్యకి.

నీరజ ఆ కవరు చింపి, అందులోంచి నాలుగు పేజీల ఉత్తరం బయటకి తీసింది. ముత్యాల్లాంటి గుండ్రటి అక్షరాలు తెలుగులో కనిపించాయి.

**విజయవాడ**

17-9-1984

డియర్ నీరజ,

ఈ ఉత్తరం నేను మరణించేలోగా మీరు రాకపోతే ఆ తర్వాత నీకు అందుతుంది. రాజేష్ మూలంగా మీకు, మీ భర్తకి మనస్పర్థలు తప్పకుండా వచ్చి వుంటాయనుకుంటున్నాను. మీరిద్దరూ ఆ కారణంగా విడిపోరనే నమ్మకం నాకుంది. ఎలాగో తర్వాత చెప్తాను.

ముందర నా గురించి - విజయవాడలో లిటిల్ ఫ్లవర్ కాన్వెంటులో టీచర్‌గా పనిచేస్తున్నాను. ఈ లోకంలో నాకు రాజేష్ మినహా మరెవ్వరూ లేరు. తోబుట్టినవాళ్ళు, తల్లిదండ్రులు, బంధువులు లేరు.

నేనో కఠినమైన సమస్యని ఎదుర్కొంటున్నాను. నాకు లంగ్ కేన్సర్. ఇక అట్టే రోజులు బ్రతకనని డాక్టర్ చెప్పేశారు. నా మరణానంతరం నా కొడుకు అనాథ అయిపోతాడు. ఒకరిద్దరు తెలిసినవాళ్ళకి నా పరిస్థితి చెప్పి, రాజేష్‌ని పెంపకానికి తీసుకోమని చెప్పాను. వాళ్ళు అంగీకరించలేదు. అనాథ శరణాలయంలో చేర్పించమని సలహా యిచ్చారు. నిజానికి ఆర్థికంగా పోషించలేని పరిస్థితిలో వున్న అనేకమంది ఒకరిద్దరు తరువాత పిల్లలు కలగకుండా జాగ్రత్తపడే ఈ రోజుల్లో పరాయివాళ్ళని పెంపకానికి తీసుకోటానికి ఇష్టపడరు కదా!

అయితే రాజేష్ తలిదండ్రుల ప్రేమ పొందకుండా అనాథ శరణాలయంలో పెరగడం నాకెంతమాత్రం ఇష్టంలేదు. వాడికి తలిదండ్రుల ప్రేమ కొంతకాలందాకానయినా అవసరం.

ఈ సంగతులన్నీ తెలిసి నా స్నేహితురాలు నాకో సలహా ఇచ్చింది. అది నాకు నచ్చిందా లేదా అన్న విషయం చెప్పాను. ఆ సలహా ప్రకారం రాజేష్‌కి మీ మామగారు దశరథరామయ్య గురించి, మీ ఆయన సాంబశివరావు గురించి చెప్పసాగాను. వాళ్ళు వాడి తాతయ్యా, తండ్రి అని నమ్మించసాగాను. మీ భర్త చిన్నప్పటి సంఘటనలు, ఆయన అభిరుచులు, అలవాట్లూ అన్నీ నా కొడుక్కి బోధించసాగాను. అవి ముందు ముందు మిమ్మల్ని నమ్మించడానికి ఉపయోగపడతాయని. క్రమంగా నా ఆరోగ్యం పాడయి, ఇక హాస్పిటల్‌లో చేరాల్సిన పరిస్థితి వచ్చేసింది. నా స్నేహితురాలు మీ వివాహం తాలూకు వెడ్డింగ్ కార్డ్ యిచ్చింది. మీ వివాహం జరిగే రోజు నేను నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. రాజేష్‌ని మీ దగ్గరకి పంపించాను.

ఒంటరిగా రాజేష్‌ని ఒక్కడినే రైల్లో అంత పెద్ద మహాపట్నానికి పంపడానికి నా మనసు ఎంత గిలగిలలాడిపోయిందో చెప్పినా మీకు అర్థం కాదు .మీ ఇంటిదాకా తీసుకువచ్చి వదలాలనుకున్నాను. కానీ ఆ సంగతి రాజేష్ మీకు చెప్తాడు. ఇంటిదాకా వచ్చిన వ్యక్తి ఇంట్లోకి రాకుండా ఎందుకెళ్ళిందా అన్న అనుమానం మీలో కలగచేయడం ఇష్టంలేక రాలేదు. నా స్నేహితురాలు మేరీకి ఉత్తరం రాసాను. రాజేష్‌ని స్టేషన్‌లో రిసీవ్ చేసుకోమని. రాజేష్ క్షేమంగా చేరినట్లు టెలిగ్రాం ఇప్పించమని మీకు ఉత్తరం రాసి రాజేష్ జేబులో పెట్టాను. మీనించి టెలిగ్రాం రాలేదు. టెలిగ్రాఫ్ ఆఫీస్‌కి వరసగా నాలుగురోజులు వెళ్ళి ఎంక్వయిరీ చేయించాను. ఇంటివాళ్ళింటికి నా పేర టెలిగ్రాం వచ్చిందేమోనని. రాలేదు.

రాజేష్ ఏమయ్యాడో తెలియక, వుండబట్టలేక డాక్టర్ వద్దంటున్నా మీ ఊరు వచ్చేశాను. రాజేష్‌ని మీతో చూశాక ఆనందపడ్డాను. కొద్ది క్షణాల్లో హైదరాబాద్‌లో మీకు దొరికిపోయి వుండేదాన్నే. రాజేష్ నన్ను చూసి గుర్తుపట్టాడు. అదృష్టం కదిలే బస్‌లో ఎక్కబట్టి తప్పించుకోగలిగాను. లేకపోతే నా ప్రయాస వృథా అయి వుండేది.

రాజేష్ మీ దగ్గర, మీ కుటుంబ సభ్యుడిగా పెరుగుతున్నాడనన్న నమ్మకం కలిగింది కాబట్టి నేను యిక్కడికి వచ్చేశాను.

ఇప్పుడెంతో ప్రశాంతంగా వుంది. రాజేష్ విషయంలో నాకెలాంటి బెంగాలేదు. మరణం కోసం ఎదురుచూస్తున్నాను. నా మరణం గురించి రాజేష్‌కి తెలియటం నాకిష్టంలేదు. కొద్దికాలానికి నేనో తీపి గుర్తుగా నిలిచిపోతాను. నన్ను మర్చిపోయి మీకు మాలిమి అవుతాడనుకున్నాను. మీ కొడుకుగా పెరిగి అభివృద్ధిలోకి వస్తాడనుకున్నాను.

అకస్మాత్తుగా 'పల్లకి' వారపత్రికలో 'దేముడికో లేఖ' శీర్షికలో బహుమతి పొందిన రాజేష్ ఉత్తరం చదివాక నా గుండె బద్దలయింది. వాడు అనారోగ్యంతో నాలాగే హాస్పిటల్‌లో మంచం ఎక్కాడని తెలియగానే వాణ్ణి చూడాలనిపించింది. డాక్టర్‌కి జరిగినదంతా వివరంగా చెప్పాను. ఈ పరిస్థితిలో నన్ను మంచం మీంచి కదలడానికి ఒప్పుకోలేదు. రాజేష్‌ని తనే పిలిపిస్తానని చెప్పారు. నా పేర టెలిగ్రాం పంపారు. నాలుగురోజులు దాటినా మీరెవరూ రాలేదు. నా మనసు మనసులో లేదు. నేనిక బ్రతికేది అతి తక్కువ కాలం. ఈలోగా మీరు రాకపోతే ఆ తర్వాత వస్తే ఇది మీకు డాక్టర్ అందిస్తారు.

నీరజా! దయచేసి నా రాజేష్‌కి మీ ఇంట్లో యింత నీడ యివ్వు.

ఇదంతా తెలిశాక వాడిని అనాధని చేయవద్దు. రోజుకో గుప్పెడు మెతుకులు, పిడికెడు ప్రేమ తప్ప వాడికింకేం అక్కరలేదు.

నిజానికిది నీ పిన్నమ్మ శక్తిదేవి పథకం. ఆవిడ గుంటూరులో వుంటోందిగా. అప్పుడు మేం పక్క పక్క పోర్షన్‌లలో వుండేవాళ్ళం. మంచి చెడు అంతా ఆమెకి చెప్పుకునేదాన్ని. ఈ రోగం సంగతి తెలిశాక ఆవిడకి నా బాధ చెప్పుకున్నాను. మీకు తెలుసుగా, ఆవిడ ఆర్థికంగా చితికిపోయిన మనిషి. రాజేష్ ఆవిడకి భారం అవుతాడు.

మీరు మీ పదహారో ఏటదాకా మీ పిన్నమ్మ దగ్గరే పెరిగారు. ఆవిడకి మీ మనస్తత్వం బాగా తెలుసు. మీ వివాహానికి పూర్వం మీ భర్త కొడుకుగా ఓ కుర్రవాడు మీ యింటికి వస్తే, మీరు ఎలా రియాక్ట్ అవుతారో తనకి తెలుసని, రాజేష్‌ని మీ దగ్గరకి పంపమని తనే సలహా యిచ్చింది. అయితే రాజేష్ మీ భర్త కొడుకు కాదని తెలిస్తే మాత్రం మీరు వాడిని ఆదరించరని, అప్పటిదాకా అసలు విషయం తెలుసుకోడానికి ప్రయత్నిస్తారని చెప్పింది. ఆ రహస్యం మీకు తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. చివరికి స్కూల్ రిజిష్టర్‌లో కూడా రాజేష్ తండ్రి పేరు మీ భర్త పేరుగా మార్పించాను. మీ పిన్నమ్మ వూహ కరక్టే. మీరు స్కూలు రిజిష్టర్‌లో పేరు కూడా తనిఖీ చేశారు. ఈ మధ్య మీ యింటికి వచ్చిన మీ కజిన్ ద్వారా రాజేష్ కులాసా అని తెలుసుకుని మీ పిన్నమ్మ, రాజేష్ గురించి దిగులు పడవద్దని నాకు ఉత్తరం రాసింది. నేను నా మరణం కోసం ఎదురు చూస్తుండగా వాడి అనారోగ్యం గురించి తెలిసి ఈ మొత్తం పథకాన్ని భగ్నం చేశాను. వాడిని చూడాలనే మాతృవాంఛని అరికట్టలేకపోయాను. టెలిగ్రాం పంపించాను.

మీకు, మీ భర్తకి చేతులెత్తి మొక్కుతున్నాను. దయచేసి వాణ్ని మీ బిడ్డగా భావించి పెంచుకోండి. రాజేష్‌ని అన్నిటికన్నా ముఖ్యంగ మీ భర్త సాంబశివరావే తన తండ్రిగా భావించనివ్వండి. అలా అయితే పరాయివాళ్ళ దగ్గర పెరుగుతున్న భావన వుండదు. అది పెరిగే పిల్లలకి మంచిదికాదు.

రాజేష్ తండ్రి వాడు పుట్టకుండానే మరణించాడు. ఆ ఏక్సిడెంట్‌లో నేనూ మరణిస్తే బావుండేది అని ఎన్ని వందలసార్లు అనుకున్నానో గత నెలగా.

పెద్దయ్యాక, అవసరం అనుకుంటేనే ఈ విషయాలు రాజేష్‌కి చెప్పండి.

పెద్ద మనసుతో ఆలోచించి, నా అభ్యర్ధనని మన్నించమని కోరుతూ నాకన్నా చిన్నదానివయినా నీకు చేతులెత్తి మొక్కుతున్నాను.

**మీ సావిత్రి.**

నీరజ మనసు ఎంతో బరువెక్కినట్లయింది ఆ పెద్ద ఉత్తరం చదవగానే.

దాన్ని భర్త చేతిలో పెట్టింది.

సాంబశివరావు చదివి తన తండ్రి దశరథరామయ్యకి అందించాడు.

"వాటేపిటీ" చెప్పింది నీరజ.

సాంబశివరావు మౌనంగా వుండిపోయాడు.

"సావిత్రి కోరికని తీరుస్తామని చెప్తాను. రాజేష్ నా మనవడు, నా రక్తం పంచుకుని పుట్టకపోయినా నా కొడుకు బిడ్డ. నీకేమైనా అభ్యంతరమా?" అడిగాడు దశరథరామయ్య.

"లేదు. ఎంతమాత్రం లేదు" మనస్ఫూర్తిగా చెప్పింది నీరజ.

పది నిమిషాల తర్వాత డాక్టర్ వచ్చి చెప్పాడు.

"రండి"

ముగ్గురూ భారమయిన హృదయాలతో ఆయన్ని అనుసరించారు. సావిత్రి గదిలోకి వెళ్ళారు.

అచేతనంగా చూస్తూండిపోయాడు దశరథరామయ్య.

స్థాణువైపోయాడు సాంబశివరావు. శిలలా నిలబడిపోయింది నీరజ.

ఇందాక సావిత్రి గొంతుదాకా కప్పివున్న తెల్లదుప్పటి ఇప్పుడు ఆమె ముఖాన్ని కూడా మూసేసి వుంది. ఆమె పక్కనే కూర్చుని వున్న రాజేష్ చూపుల్లో ఏదో వింత, అస్పష్టమయిన, అర్థంకాని భావం.

"డాడీ అమ్మ చచ్చిపోయింది" చెప్పాడు.

మంచం మీంచి, తల్లి శవం పక్కనించి లేచి దశరథరామయ్య దగ్గరకి వచ్చి చెప్పాడు రాజేష్.

"తాతయ్యా అమ్మ చచ్చిపోయింది."

దశరథరామయ్య వెంటనే రాజేష్‌ని దగ్గరకి తీసుకున్నాడు.

"తాతయ్యా అమ్మ నన్ను ఏడవ్వద్దంది. ఏడిస్తే నరకానికి వెళ్తుందిట, ఏడవకపోతే నేను బాగా చదువుకుని పైకొస్తే, స్వర్గానికి వెళ్తుందిట. ఏడవను తాతయ్య. అమ్మకోసం యింకెప్పుడూ ఏడవను. నేనేడుస్తే నరకానికి వెళ్తే అబ్బ నరకంలో యమభటులు ఏం చేస్తారో చెప్పింది. నేను ఇంకెప్పుడూ అలా పారిపోను తాతయ్యా. మీరు చెప్పినట్లు విని, బాగా చదువుకుని పైకొస్తాను" తాతయ్యని చుట్టుకుపోయి చెపుతున్నాడు రాజేష్.

ఒక్క రాజేష్ తప్ప మిగతా అంతా ఏడుస్తున్నారు.

***

### *ఎపిలోగ్*

రవీంద్రభారతిలోని ప్రేక్షకుల హృదయాలన్నీ బరువెక్కాయి. ఇప్పుడు అంతా రాజేష్ వంక చూస్తున్నారు.

కండువాతో చెమర్చిన కళ్ళని తుడుచుకుని చెప్పాడు దశరథరామయ్య.

ప్రతి మనిషి జీవితంలో సగభాగం 'అయితే', 'ఇలా అవుతుంది' అనుకునే ఏదయినా మొదలుపెడతాడు. ఒకోసారి అనుకున్నది అవచ్చు. ఒకోసారి కాకపోవచ్చు. అది ఆ మనిషి అంచనా వేసిన పునాదిమీద ఆధారపడి వుంటుంది. సావిత్రి రాజేష్‌ని మా ఇంటికి పంపినప్పుడు 'ఇలా అవుతుంది' అనుకుని పంపించింది. అలా కొంతే అయింది. పూర్తిగా కాలేదు. పల్లకిలో రాజేష్ లేఖ చదివాక, మేం బెంగుళూరు వెళ్ళాక ఆమె అనుకున్నది పూర్తిగా సాధ్యపడింది. ఆమె చాలా

జాగ్రత్తలు తీసుకుంది. ఉదాహరణకి మా సాంబశివరావు గురించి అనేక విషయాలు నీరజ పిన్నమ్మ సేకరించి వాటిని సావిత్రికి తెలియచేసింది. అవి రాజేష్ చెప్పినప్పుడల్లా మాతో సాంబశివరావు అబద్ధం ఆడుతున్నాడనే అనుమానం కలిగేది."

ప్రేక్షకులంతా నిశ్శబ్దంగా వింటున్నారు.

"ఇదీ సంగతి. మీరంతా మా అబ్బాయి కొలీగ్స్. అతన్ని హేళన చేస్తున్నారని తెలిసి యిదంతా చెప్పాల్సి వచ్చింది."

ప్రేక్షకులలోంచి దాదాపు ఇరవై చీట్లు ఆయనకి అందజేయబడ్డాయి. వాటిని చదివి చిరునవ్వుతో చెప్పాడు దశరథరామయ్య.

"రాజేష్ నువ్వు మాట్లాడాలని వాళ్ళడుగుతున్నారు."

"నేనా?" సిగ్గుపడ్డాడు రాజేష్.

"అవును. మేం వింటాం" చాలామంది "ప్రేక్షకులలోంచి గట్టిగా అరిచారు.

రాజేష్ పైకి లేచి మైక్ దగ్గరికి వెళ్ళాడు. రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని చెప్పాడు మైక్ అడ్జస్ట్ చేసాక.

"హలో టు ఎవ్విరిబడి. ఏం మాట్లాడను?"

"మీ అమ్మ గురించి."

ఒకేసారి చాలామంది అరిచారు.

"వెల్... అమ్మ... మా అమ్మ ఇప్పుడు స్వర్గంలో వుంది. నేనూ ఓ రోజు మా అమ్మ దగ్గరకి వెళ్తాను. అయితే మా అమ్మ చెప్పింది పూర్తి చేశాక. పెద్దయ్యాక డాక్టరయి కేన్సర్‌కి మందు కనిపెట్టి అప్పుడు నేనూ ఓ రోజు మా అమ్మ చెప్పిన ఆ కవిత చెప్తాను. ఆ తర్వాత శాశ్వతంగా అమ్మతో వుంటాను."

"ఏం కవిత?" అడిగింది నీరజ.

చిన్నగా నవ్వాడు రాజేష్.

"అమ్మ మాట్లాడిన ఆఖరి మాటలివి."

గొంతు సర్దుకుని ఎంతో మృదువుగా, సాఫీగా చెప్పాడు.

**"అర్ధరాత్రి ఎవరో పిలిస్తే,**
**తలుపు తెరచి చూశాను.**
**ఎదురుగా దీనంగా, బిచ్చగత్తెలా మృత్యువు.**
**కాదనలేక వెంట వెళ్తున్నాను."**

*(సమాప్తం)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in